IJCRT.ORG ISSN : 2320-2882

INTERNATIONAL JOURNAL OF CREATIVE RESEARCH THOUGHTS (IJCRT)

An International Open Access, Peer-reviewed, Refereed Journal

# గంగాధర్ వడ్లమన్నాటి హాస్యకథల్లో సామాజిక సమస్యలు ` సామరస్య జీవనంపట్ల స్పృహ

నెల్లి సంతోష్‌కుమార్
పరిశోధక విద్యార్థి,
తెలుగుశాఖ,
ఆంధ్ర విశ్వకళాపరిషత్, విశాఖపట్నం.

పర్యవేక్షకులు :
ఆచార్య జర్రా అప్పారావు
తెలుగు ప్రొఫెసర్, తెలుగు శాఖ
ఆంధ్ర విశ్వకళాపరిషత్,
విశాఖపట్నం.

**ఉపోద్ఘాతం:**

ఆధునిక రచయితల ఇతివృత్తాలన్నీ సమాజం నుండి పుట్టినవిగానే ఉంటున్నాయి. సమకాలీన సమాజంలోని ఏ అంశాన్నైనా కథగా మలిచి ఓ సమస్యనో, కారణాలనో, ప్రభావాలనో, చైతన్యాలనో, సూచనలనో ఇవ్వడాన్ని వారు బాధ్యతాయుతంగా తలిచారు. కథా వస్తువులన్నీ జీవితాల నుండో, అనుభవాల నుండో, విన్న, చూసిన సంఘటనలు, పరిసర జీవనాలననుసరించో పుడుతుంటాయి. వాటిలో కష్టాలు, కన్నీళ్లే కాక అవగాహనలు, ఆచరణలు స్ఫూర్తిదాయకాలు ఉంటాయి. కథా భేదం ఏదైనా గానీ రచయిత భావనాశక్తిని రంగరించుకొని వెలువడుతుంది. అందులో చెప్పాల్సిన విషయాలను ప్రత్యక్ష, పరోక్షాలుగా తెలియజేస్తుంటారు. అలాగే లోపాలను చూసి సరిదిద్దే ప్రయత్నాలకు ఊతమివ్వడాన్ని చూస్తుంటాం. అలా సమాజాన్ని సరైన మార్గం వైపు నడపడం, నేనున్నాననే ఆసరానివ్వడం, తప్పొప్పుల విచక్షణను గమనింపజేయడం వంటివి ఓ బాధ్యతగా స్వీకరించడం అనే విధితో ప్రతి రచయితా ఓ సంస్కర్తలా వ్యవహరిస్తుంటారు. కానీ వారు చెప్పే విధానం, శైలి వంటివి మాత్రం విభిన్నాలుగా ఉంటుంటాయి.

హాస్య కథా రచయితగా గంగాధర్ వడ్లమన్నాటి గారు నవ్వుతూ నవ్విస్తూ తన నిశిత పరిశీలనను కథా వస్తువుతో జోడిరచారు. కొన్ని చోట్ల సూటిగాను, కొన్ని చోట్ల వ్యంగ్యంగాను, మరికొన్ని చోట్ల పరోక్షంగాను సామాజిక విషయాంశాలను జోడిరచి రాయడంలో వినూత్న విధానంలో గావించారు. ఈ వైనాలు రచయిత యొక్క నిశిత దృష్టిని, బాధ్యతాయుతాన్ని సూచించాయి. సాధారణ కథలలోలాగా హాస్య కథల్లో సమాజ సంబంధితాలను చేర్చడం కుదరదనే అభిప్రాయం వీరి కథలను చూసిన తర్వాత పటాపంచలవక తప్పదు. నవ్విస్తూ ఒక విషయాన్ని గురించిన చర్చను రేకెత్తించడం మరియు దాన్ని పాఠకులు అందుకోగలిగేలా చేయగలగడం సామాన్యం కాదు. అధికంగా పరోక్షంగా తెలియపరచడం ద్వారా కథా ప్రయోజనాన్ని చేకూర్చాల్సి ఉంటుంది. అక్కడ రచయిత అంతరంగ కోణాన్ని సాహితీ అభిమాని దర్శింపగలగాలి. ఇది హాస్య కథా రచయితకు ఒక సవాల్ వంటిది. దాన్ని అధిగమించడం ప్రతిభాశీలురికే సాధ్యం.

రచయిత సామాజిక అంశాలను స్పృశిస్తూ యువతకు రచయితలకు, సామాజిక సమస్యల, సామరస్య జీవన, సోషల్ మీడియా, సామాజిక బాధ్యత, మోసాల గురించి, మూఢ నమ్మకాల పట్ల, మానవ సంబంధాల, విద్యా, వృత్తి సంబంధిత స్పృహలను కలిగించారు. భిన్న కోణాలను హాస్య కథలలో చూపడం అనేది అవలీలగా చేసారు. హద్దు దాటని వ్యంగ్యహాస్యం కొన్ని చోట్ల ఉన్నా అవి సమాజంలోను, వ్యక్తులలోను ఉన్న విషయాలే కావడంచే ఆ నిస్సంకోచత్వంను కనబరిచారు.

సమస్యలను నవ్వుతూ చెప్పి సరిదిద్దుకోడానికి ఇచ్చిన అవకాశం తిరిగి అదే నవ్వును పొందాగా ప్రదర్శించేలా చేసింది. అంటే పాఠకులు ఆలోచించుకోవడం, భుజాలు తడుంకోవడం వారిలో కదలిక తెచ్చిందనడానికి సాక్ష్యం. దాదాపు అన్ని కథలూ విభిన్నాలై పలు వస్తువులను, అంశాలను సందర్శించే వీలుని కల్పించేలా తీర్చబడ్డాయి. రచయిత ఆయా కథలలో తెలిపిన విషయవిశేషాలను పరిశీలించి తెలియజేస్తున్నాను.

**సామాజిక సమస్యలపట్ల స్పృహ**:

సమాజం వ్యక్తుల సమూహం. విభిన్నతలు ప్రతి చోటా ప్రస్ఫుటంగా కనిపిస్తుంటాయి. భావాలు, భావనలు ఫలితలను నిర్ణయించినపుడు సమస్యలు పలు విధాలుగా చుట్టుముట్టడం సహజం. అవి వ్యక్తి సంబంధితాలుగా కనిపించినా వ్యక్తులే సమాజం కనుక వ్యక్తికీ, సమాజానికీ ఉన్న అవినాభావ సంబంధం వలన సామాజిక సమస్యలై జీవనాలను చుట్టుముట్టుతాయి. ఒక్కచోట మొదలైనవి వ్యవస్థ మొత్తానికీ పాకి తీవ్ర కష్టనష్టాలను కలిగిస్తాయి. అవినీతి, సాంఘిక దురాచారాలు, పేదరికం వంటివి ఇలాంటివే. తరాలు మారినా వ్యక్తుల మూఢత్వం, స్వార్థం పెరిగిన చోట అభివృద్ధి తిరోగమించి సమస్య బలీయంగా మారుతుంది. అలాంటి కథలను కూడి రచయిత తన హాస్య కథల్లో చర్చించడం వారి సామాజిక స్పృహకు నిదర్శనం. అలాంటి కదలికకు బాటలు వేస్తూ ఆలోచింపజేసిన కథలను ఈ ఉపవిభాగంలో విశ్లేషిస్తున్నాను.

**తు.వ.గ.మొ. (తులసి వనంలో గంజాయి మొక్క):**

స్మైల్ ప్లీజ్ పత్రిక యొక్క మే, 2006 సంచికలో ప్రచురితమైన ఈ కథ '100% నవ్వు కథలు' సంపుటిలోనిది. దీన్ని రాసిన వారు గంగాధర్ వడ్లమన్నాటి. కానిస్టేబుల్ టూనాట్ ఫోర్ కోటిగాడు అనే దొంగని ఎస్సై ముందు నిలబెడతాడు. పట్టుబడినందుకు తిడుతున్న ఎస్సైకి ఇరవై వేలు డబ్బుని కోటిగాడు అందిస్తాడు. మిగిలిన దొంగలు కేజీల కొద్దీ బంగారం, లక్షలతో పట్టుబడుతున్నారని వారి ద్వారా తనకు లాభం ఉంటోందని ఎస్సై అంటాడు. ఈ ఎస్సై కన్నా జలగల పాలెం ఎస్సై ఇరవై శాతం కమీషన్ తీసుకొంటున్నాడని అక్కడ లొంగిపోతున్నానని కోటిగాడు చెప్తాడు. సి.ఐ. గారి చిన్నింటిలో దొంగతనం చేస్తూ పట్టుబడ్డానని ఈసారి ఆ పక్కనే ఉన్న మేడలో దోపిడీ చేసి ఎక్కువ తెస్తానని కోటిగాడు పలుకుతాడు. ఆపని మాత్రం చేయొద్దని అది తన ఇల్లని అంటే ఎస్సై ఆ అరవైవేలు కోటిగాడికి తిరిగిచ్చేస్తాడు.

విశ్లేషణ :

సమాజ సమస్యలలో అతి ముఖ్యమైన అవినీతి రక్షణ వ్యవస్థలో ఏ విధంగా పేరుకుపోయిందో ఈ కథనం అద్దం పట్టింది. ఆధునిక సమాజం సమస్యల వలయంలో చిక్కుకునిపోయింది. డబ్బు కోసం దిగజారిన ప్రవర్తన ప్రతీ చోట ఉవ్వెత్తుతున్నాయి. ముఖ్యంగా అవినీతి బురదలో కూరుకుపోని వ్యవస్థ లేదు, ఆ మికిలిని అంటించుకోని వ్యక్తి లేడు. ఈ విషయం రచయితను కలచివేసింది. అందరిలా సమస్యను ఒకే కోణంలో కాక హాస్యకోణంలో చెప్పాలని ఈ కథా సంభాషణలను నవ్వుల్తో ముంచెత్తారు. సమాజానికి రక్షణను, సేవను చేసే పోలీసులు అవినీతికి పాల్పడితే దొంగకు, పోలీసుకీ తేడా ఉండదు. దొంగ ఇంటిని దోచుకోగా, పోలీసు దొంగను దోచుకొంటున్నాడు. అలాగే డబ్బు కోసం నేరాలను తారుమారు చేస్తూ అడుగడుగునా తప్పులు చేస్తున్నాడు. ఈ కథలో దొంగ కోటిగాడికీ, ఎస్సైకి మధ్య జరిగిన మాటలు నవ్విస్తూనే ఆలోచింపజేసాయి. పోలీసు వ్యవస్థ, అందులోని ఉద్యోగుల ఖాకీ రంగు వెనక ఉన్నట్టి నీతి తప్పిన నలుపుకి వెలుగులోనికి తెచ్చారు. ఈ కథలోని ఎస్సై మాటల్లో ఆ అసలు రంగు బయటపడుతుంది.

"బోడి ఇరవైవేలా! నీ దొంగ వృత్తికే అవమానం, అయినా నీ తోటి దొంగల్ని చూసి సిగ్గు తెచ్చుకో. పోయిన నెల చోరపాలెం దొంగ, "కే.జి బంగారంతో పట్టుబడ్డాడు. పోయిన వారం ఆ కన్నాలపురం వాస్తవ్యుడు ఒకడు లక్ష రూపాయల దొంగ సొమ్ముతో దొరికిపోయాడు. వెంటనే వారికి ఆ దొంగ సొమ్ములో నలభైశాతం వాటా ఇచ్చి, చిన్నగా మందలించి వదిలేశా" (100% నవ్వు కథలు : పుట ` 31)

ఈ వాక్యాలు ఓ ఎస్సై దొంగతో పలికినవి. ఇక్కడ అసలు దొంగలెవరో డబ్బు కోసం వృత్తినే పణంగా పెట్టి దోచుకుంటోన్న వైనాలెలా ఉంటాయో చూపించారు. దొంగలకు, పోలీసులకు మధ్య ఉండే లాలూచీలు ఇద్దరూ ఒకట్రైపోయి దొంగసొమ్మును పంచుకొనే తోడు దొంగలవడం శోచనీయం. ఇలాంటి వారి వలన సమాజంలో శాంతిస్థాపనగానీ, నేర నిర్మూలనగానీ, దుర్మార్గులకు శిక్షలు గానీ జరగవని స్పష్టం చేసారు. ఎవరి వద్దనైనా డబ్బునో, పర్సంటేజీనో పుచ్చుకొని వదిలిపెట్టడం వలన నేరగాళ్ళలో భయం ఉండదు. 'మీ స్టేషన్‌లో లొంగిపోవాలంటే మాసెడ్డ సిరాకు నాకు' అంటూ ఓ దొంగ

ధైర్యంగా ఎస్సైతో అనడం చూస్తే ఈ వ్యవస్థపై నమ్మకం పూర్తిగా పోతోంది. పైగా ఇంకా పెద్ద దొంగతనం చేయాలని కోటిగాడికి చెప్తున్న ఎస్సై మాటలు ఎంత పెద్ద నేరాలకు పాల్పడితే తమకు అంత లాభాలు వస్తాయనడాన్ని చూడగలం. ఈ మాటలు ఎంతో కలవరపెడుతున్నాయి. సమాజం ఆర్థిక, కుటుంబ, వ్యక్తిగత సమస్యలతో సతమతమవుతూ పోలీసుల రక్షణ ఈ సమాజానికి ఉందని ధైర్యంగా నిద్రిస్తారు. కానీ ఇంటి దొంగలే దోచుకొంటున్నారని తెలిసి కంటి మీద కునుకుండదు. నమ్మినవాడే నేర్పుగా నేరగాళ్ళకు సహకరించి జేబు నింపుకోవడం వ్యవస్థ భద్రతకు పెను సవాళ్ళను విసురుతోందనే అభిప్రాయ వెల్లడిని చేసారు.

అవినీతి అనేది విచ్చలవిడిగా పేరుకొనిపోయింది. రూపాయి కోసం చేయగూడని పనులను యధేచ్చగా చేస్తున్నారు. లంచాలను అధికారులకు చెల్లించి ఎంతటి నేరం నుంచైనా తప్పించుకొంటున్నారు. దీనికి కారణం పోలీసు వ్యవస్థ నీతి తప్పడం. జీతాలు అందుకొంటూ వృత్తి ద్రోహానికి పాల్పడి దొంగలను మించిన గజదొంగగా మారాడు. నీతికి, ధర్మానికి, న్యాయానికి ప్రతీకగా నిలిచే వానిగా కాక అవినీతికి కొమ్ముకాస్తూ విధి ధర్మాన్ని కాలరాస్తున్నాడు. ఇలా నేరాలను అరికట్టాల్సిన వారు నేరగాళ్ళైపోతుంటే అరాచకం ప్రబలిపోతోంది. ఏ వ్యవస్థలో తప్పు జరిగినా న్యాయం చేయడానికి చట్టం ఉందనే నమ్మకం ఉండేది. కానీ కంచె చేనుని మేసినపుడు పచ్చదనం మాయమై పచ్చకాగితాలకై పాకులాడటం జరుగుతోంది. కోటిగాడు జలగల పాళెం ఎస్సై గురించి చెప్తూ, సంక్రాంతి, దసరాలాంటి పండగ సీజన్లో దొంగతనం చేసి దొరికిపోతే శిక్షలో డిస్కౌంట్లు ప్రోత్సాహక బహుమతులు కూడా అందజేస్తారు' అన్నాడు. అంటే ప్రతి రక్షక భటుడూ అవినీతి పరుడేనని తేల్చి చెప్పినట్లుంది. పండగల సమయంలో అధిక రద్దీ అప్రమత్తత వలన దొంగతనాలు జరుగుతాయి. అప్పుడు అధిక లంచాలు పోలీసులకుంటాయి. పైగా దొంగలకు ప్రోత్సాహకాలు ఇవ్వడమంటే దొంగకు పట్టపగ్గాలుండవు. ఈ అవినీతి దృక్పథాలు మాయం అయినప్పుడు సమాజం శాంతిధామంగా మారగలదని తెలిపారు. వ్యవస్థ నమ్మకాన్ని నేలపాలు చేస్తూ అవినీతిలో కూరుకుపోవడం తగదని హితవు పలికారు.

**సామరస్య జీవనంపట్ల స్పృహ:**

లౌకిక సంఘ జీవనానికి సామరస్యం, సౌభ్రతృత్వం ఎంతో అవసరం. వ్యక్తులు, పక్కింటివారు, సహోద్యోగులు, కుటుంబాలు, కులాలు, మతాలు సమాజాలు, దేశాలు అన్నీ అంతరాలెరగని సహజీవనాన్ని స్వాగతించాలి. నేను బాగుంటే చాలనే స్వార్థాన్ని వదిలి 'నేను బాగుండాలి, నా పక్కవారూ బాగుండాలనే శాంతి మంత్రం ప్రశాంతతను ఇస్తుంది. శాంతిని పొందాలన్నా, కోల్పోవాలన్నా అది యాదృచ్చికం కాదు. వ్యక్తి స్వయంకృతాపరాధం. ఎప్పుడైతే సామరస్య జీవన స్పృహని సమాజంలోని వ్యక్తులు మరచిపోతారో అక్కడ అశాంతి, అభద్రత, అనాలోచితాలే చోటు చేసుకొంటాయని రచయిత అభిప్రాయపడ్డారు. ఒక్కోసారి చిన్న చిన్న పట్టింపులే వ్యక్తుల్ని, వ్యవస్థల్ని అతలాకుతలం చేస్తాయి లేనిపోని వివాదాలకు, విద్వేషాలకు బాటలు వేస్తాయి. అలాంటి ఇతివృత్తాలున్న హాస్య కథలను ఇక్కడ పరిశీలిస్తున్నాను.

**పప్పులో కాలు:**

ప్రస్తుత కథ గంగాధర్ వడ్లమన్నాటి 'కేవలం హాస్య కథలు' సంపుటిలోని పప్పులో కాలు కథలో మధు, లలిత భార్యాభర్తలు. ఓరోజు మధు ఓ చీరని కొని తేగా దాన్ని చూసి లలిత మురిసిపోతుంది. పెళ్ళిరోజు నాడు ఎంతో కష్టపడి చాలా వంటకాలు రుచికరంగా చేసినందుకు చిన్న కానుక అని మధు అంటాడు. అవి తాను చేసినవి కావని పక్కింటి బామ్మగారిచ్చినవని లలిత అంటుంది. ఆ విషయం తనకు తెలుసు అంటూ సంక్రాంతి రోజు బామ్మగారిచ్చిన వంటల రుచి, పెళ్ళిరోజు వంటల రుచి ఒకటే కనుక పోల్చుకున్నానంటాడు. అందుకే ఆ చీర బామ్మకోసం తెచ్చానంటాడు. అంతలో అక్కడకు వచ్చిన బామ్మ ఆయా వంటకాలన్నీ స్వంత గృహం పిండివంటల దుకాణం నుండి తెప్పించినవని వారికి చెప్పి, చీర తీసుకొని వెళ్ళిపోతుంది.

**విశ్లేషణ:**

సమాజంలోని వ్యక్తులు వారివారి జీవన విధానాలతో ఉన్నా అందరితోనూ కలిసి మెలిసి ఉండాలని ఈ కథనం ప్రబోధించింది. సామరస్య జీవన విధానం ఈ సంఘ మనుగడకు ప్రధాన బాధ్యతగా తయారైందనే ఆలోచనతో, ప్రవర్తనావళితో మనగలగాలన్నదే రచయిత ఉద్దేశ్యం. మనిషి ఒంటరిగా మనలేడు అందుకే తోడుగా కుటుంబం, స్నేహాలు, బంధువులు, పరిచయస్తులు అలా అనేక

మందిని కలగలుపుకొంటాడు. అలాంటప్పుడు అందరితోనూ సర్దుకొనిపోతూ ఐకమత్యంగా ఉండాల్సి ఉంటుంది. అలా ఉండగలగటం ఈ లౌకిక దేశానికి ఎంతో ముఖ్యం. ఇక్కడ సౌభ్రాతృత్వం అనేది ప్రతీ పౌరుడి ఆదేశ సూత్రం. పైగా సంప్రదాయక దేశంగా ఉంటూ పలు మతాలు, వివిధ కులాల సమ్మేళనంలో ఎవరూ ఎవరినీ నొప్పించక వారివారి సిద్ధాంత సమూహాలతో కలిసి జీవించాలి. అలా దృక్పథాలు వేరైనా అందరు ఒకటేనని ఏకాభిప్రాయంతో నడవాలి. ఇది చుట్టుపక్కల వారితో మన సఖ్యత నుండి పక్క రాష్ట్రాలు, దేశాలతో సౌభ్రాతృత్వం వరకు వర్తిస్తుంది. అంటే అతి చిన్న ప్రామాణికం నుండి బృహత్ వ్యవస్థల వరకు అందరం మైత్రీ భావంతో జీవించాలన్న నిశ్చయం ఉండి తీరాలి. ముందుగా ఇరుగుపొరుగుల వద్ద మన సమాజ జీవనమెలా ఉండాలో ఈ కథలో మధు, బామ్మల కుటుంబాల ద్వారా ఉదహరించారు.

ఒక ఇంట్లోని వారి మధ్య బంధాలు, అనుబంధాలు ఉంటాయి కనుక అవి వ్యక్తుల్ని కలిపి ఉంచుతాయి. అదే సమాజంలో మనకు ఏమీ కాని వ్యక్తులను, కుటుంబాలను కూడా దగ్గరివారిగా తలిచే విశాల దృక్పథం ఉండాలి. దీనికై సాన్నిహిత్యాలను పెంచే కొన్ని ప్రవర్తనలను అలవర్చుకోవడం ముఖ్యం. సాయం చేసే గుణం, మానవత్వంతో స్పందించడం, కష్టసుఖాలలో పాలుపంచుకోవడం, సౌమ్యంగా వ్యవహరించడం, గొడవలకు పోక సర్దుకొనే తత్వం, ఓ చిరునవ్వు ఇవే మనిషి మనిషి నుండి కోరుకొనేది. ఈ భరోసా కోసమే మానవుడు సంఘ జీవనాన్ని అభిలషించాడు. దాన్ని నిలుపుకోవలసిన బాధ్యత ఈ సమాజంలో నివసించే అందరిపైనా ఉంది. కానీ నేటి ఆధునిక జీవన విధానం పట్టణ, పాశ్చాత్య, అపార్ట్‌మెంట్ కల్చర్‌ల పరమై ఎవరికి వారే యమునాతీరే అని ప్రవర్తిస్తున్నారు. సంవత్సరాల కాలాలు కలిసి ఒకే చోటున్నా ఒకరి పేరు మరొకరికి తెలియని తనాలుంటున్నాయి. అవసరార్థాలే మనుషులు అన్నట్లు వారితో నాకేం అవసరమనే ధోరణులు ప్రబలాయి. అంతేకాక కుల, మత, ఆర్థిక, ఆచార వైవిధ్యాలు ఒకరి నుండి మరొకరిని దూరంగా మసలమని ఆదేశిస్తున్నాయి. డబ్బు తప్ప మానవ సంబంధాలేవీ వద్దనే కారణ్యత వ్యక్తుల్లోనూ, వ్యవస్థలలోనూ నెలకొంది. ఫలితంగా కలిసి ఉంటున్నా దూరాలు అంతటా నెలకొన్న నేపథ్యంలో ఈ కథనం ద్వారా సామరస్య జీవన స్పృహను రుచి చూపించారు.

వ్యక్తులు, సమాజాలు, దేశాలు అనే గిరిగీచుకుని బతకడం ఎప్పుడూ మంచిదికాదు. 'కలసి ఉంటే కలదు సుఖం' అనే భావన కులమతాలకు అతీతమై సర్వసౌభ్రాతృత్వాన్ని నెలకొల్పుతుంది. కథనంలోని బామ్మగారు తన పక్కింటి వారికి పెద్దదిక్కులా మారింది. అలాగే ఆమె అభిమానానికి తగిన విధంగా ఇచ్చిపుచ్చుకోడాల గౌరవాలను మధుర దంపతులు నిలుపుకొన్నారు. అవసరం అయినపుడు సాయం చేసుకోవడం, ఎదుటివారి ఆనందాన్ని కోరుకోవడం అందర్నీ కలిపి ఉంచుతుంది. నేటికాలంలో ఓ కుటుంబ సభ్యులే దూరాలను పెంచుకొంటున్నారు. ఇక సమాజంతోనో, ఇతరులతోనో నాకేం పని అనుకొనేవారికి ఈ కథనం ఓ చక్కని సందేశాన్నిచ్చింది. చుట్టుపక్కల వారితో సామరస్యంగా ఉండటం ప్రశాంతతను మనోధైర్యాన్ని ఇచ్చి ఒంటరితనాన్ని దూరం చేసి భద్రతను కలిగిస్తుంది. అలాగే పొరుగు దేశాల మధ్య శాంతి మంత్రం, ఒప్పందాలు, రాకపోకలు, అతిథి గౌరవాలు వంటివి అంతర్జాతీ సామరస్య జీవనాలకు ప్రతీక. ఇలా ఈ నేలపై చిన్న, పెద్ద, వ్యవస్థలలోని వ్యక్తులందరూ కలసి బతకాలని అనుకోవడం మంచిదన్న ఉద్దేశ్యాన్ని సమర్థిస్తూ,

రివర్స్ పంచ్ :

గంగాధర్ వడ్లమన్నాటి రాసిన 'కేవలం హాస్య కథలు' సంపుటిలోని కథలలో కాంతం, సుబ్బారావుల ఇంట్లో శేఖరం, లలిత అద్దెకుంటుండేవారు. వారు ఒక వారంలో ఇల్లు ఖాళీ చేస్తున్నామనడంతో కాంతం నీళ్ళ మోటారు వేయద్దంటుంది. వారు ముందే నెలకు సరిపడా బిల్లు చెల్లించారని సుబ్బారావు చెప్పినా కాంతం వినిపించుకోదు. దీంతో మధు బావిలో నీరు తోడి తెచ్చేవాడు. ఇల్లు ఖాళీ చేసే రోజు లలిత, కాంతం ఇంటికి వచ్చి స్వీట్లు ఇస్తుంది. వారి నిర్ణయం వలన తన భర్త మధుకి నడుంనొప్పి తగ్గి, ఫిజియోథెరపీ డబ్బంతా మిగలిందంటుంది. బావిలో ఓ పురాతన నాణెం దొరికి పదవీ ఉన్నతిని అందుకోబోతున్నాడని చెప్తుంది. లలితతో మధు అలా అబద్ధాలెందుకు చెప్పావని అడుగుతాడు. వాళ్ళను ఇబ్బంది పెట్టాలని చెడు చేసినా మంచే జరుగుతుందని ఆవిడ గ్రహించి మారాలని వివరిస్తుంది. ఇంతలో కాంతం కరెంటు బిల్లులో వీరికి మిగిలిన డబ్బుని ఇచ్చేస్తుంది.

విశ్లేషణ :

సమాజంలో వ్యక్తుల స్వార్థాలు దూరాలను పెంచుతాయి. సంఘజీవనానికి పనికిరాని ఇలాంటి వ్యక్తుల నైజాలు సామరస్యాన్ని దెబ్బతీస్తాయి. అంతేకాకుండా ఐకమత్యాలకు విఘాతాలను కల్పించే ప్రవర్తనలు ఒక్కోసారి కులమతాలనే సున్నితాంశాలను కూడా స్పృశిస్తాయి. ఇలా వైషమ్యాలను

రెచ్చగొట్టుకొంటే చిన్న చిన్న కారణాలే పెను విపత్తులకు దారి తీయవచ్చు. ఒకరితో ఒకరికి అవసరాలు, ఆసరాలు ఉండవచ్చు. వాటిని మీరి నీతో నాకేం అవసరమనే బుద్ధిని ప్రదర్శించడం అసహ్యాకరంగా ఉంటుంది. ఈ సంఘజీవనంలో ఎవరూ ఎవరికీ ఏమీ కాకపోయినా మనమంతా ఒకే నేలపై ఉన్నాం, ఒకే గాలి పీలుస్తున్నాం అంటే చేయి చేయి కలిపితే ఓ ఆసరా, అనుబంధం మొదలవుతుంది ఇలా కాకుండా చుట్టుపక్కల వారితో మన ప్రవర్తన బాగోలకుంటే వారి నుండి అదే విధమైన స్పందనే లభిస్తుంది. కాంతం ఇంటిలో అద్దెకున్నా లలిత దంపతులు స్నేహపూర్వకంగానే ఉండి ఉంటారు. ఎలాగూ వెళ్ళిపోతారని కాంతం తన దుర్బుద్ధిని, సంకుచితత్వాన్ని చూపించింది. ఆమెకు తగిన విధంగా లలిత కూడా ప్రవర్తించింది. కాంతం రూపాయికి కక్కుర్తిపడి పరిచయస్తులు, అద్దెకున్నవారు అని కూడా చూడకుండా స్నేహతత్వాన్ని మరిచింది. ఆమె మాటలకు ఆమె భర్త అయిన సుబ్బారావు, 'ఏంటో కాంతం! నువ్వు మనుషుల్లా కాక మానులా ప్రవర్తిస్తావ్' అని అనడంలో ఆమె సామరస్యంగా మెలిగే రకం కాదని అర్థమవుతోంది. భర్తే అలా అన్నపుడు ఇతరులు, చుట్టుపక్కల వారితోను, బంధువులతోను ఎలా ఉంటుందో తెలుస్తూనే వుంది. తాము సమాజంలో భాగమని, అందరూ తమలాంటివారే కనుక సోదర భావనతో మెతుగుదామని లేకపోవడం సాంఘిక జీవనానికి విఘాతాన్ని కలిగిస్తుందని ప్రబోధించారు.

సమాజంలో నివసించేవారెవరైనా గానీ కొన్ని సామాజిక విలువలను పాటించాలి. సంఘజీవనం అంటేనే కలసి బతకడం. అలా జీవించడానికి జాలి, మానవత, సహాయతాగుణం, సర్దుకుపోవడాలు వంటివి కలిగి వుండాలి. అవే మానవ సంబంధాలకు అవసరమైన తత్వాలు, అవి లేనివారు ఎవరితోనూ సహజీవనాన్ని కొనసాగించలేరు. నేను బాగుంటే చాలుననుకొనే కాంతం వంటివారు రూపాయికి పాకులాడి నలుగురిచేత చెడు అనిపించుకొంటారు. ఇలాంటివారితో మైత్రీ దృక్పథాన్ని చూపాలని ఎవరూ అనుకోరు. ఉద్యోగార్థమో, బతుకుతెరువు నిమిత్తమో అయినవారికి దూరంగా బతికే వారికి చుట్టుపక్కల వారి సహవాసం కొండంత ధైర్యం. ఆ ధైర్యంతోనే తన భాషకాకున్నా, తన కులం వారు కాకున్నా మతం వారు కాకున్నా అసలు తమ జాతీయులే కాకపోయినా వారి పక్కన బతికేయగలరు. మనిషికి మనిషికి ఉన్న దగ్గరి సంబంధమది. కానీ నేటి హడావిడీ జీవిత పోరాటాలలో సమయాన్ని వెచ్చించుకొనే సమయం గానీ, సరదాగా గడిపే సందర్భాలుగానీ తక్కువయ్యాయి. ఎవరింట్లో వారు, ఎవరి పనులు వారివనే భావనలతో ఉంటున్నారు. కాంతం వంటి సంకుచితత్వాలున్న వారికైతే ఎవరితోనూ పనిలేదు. వారెవరితోనూ కలవలేరు. తన ఇంట్లో అంతకాలంగా అద్దెకుంటున్నా రూపాయి మిగిలిచుకోడానికి చూస్తారే గానీ ఎదుటి వారి కష్టాలకో, ఇబ్బందులకో స్పందించరు. అందుకే బుద్ధికి తగినట్లే ఎవుటివారు కూడా దూరం పెడతారు. ఇలా మంచి మానవత్వం లేనివారు సమాజ సమైఖ్య జీవనానికి తగిన వారని ఉదహరించి చూపారు.

మనుషుల మధ్య బాంధవ్యాలు లేకున్నా తమవంటివారనే మానవ సంబంధ భావం ఉండాలి. తెలిసిన వారో, తెలియని వారో ఎవరైనా గానీ తెలిసి తెలిసి కష్టపెట్టకుడదు. చేతనైతే సాయం చేయాలిగానీ అన్నీ మరచి ప్రవర్తించకూడదు. నలుగురితోనూ మంచిగా మసలే గుణగణాలుండాలి. మనమేం చేస్తే అదే ఇతరుల నుండి తిరిగి వస్తుంది. ముఖ్యంగా ఈ పట్టణ జీవితాలలో నువ్వెవరో, నేనెవరోనని భావనలు ఎక్కువయ్యాయి. కలసి ఉంటున్నా పట్టించుకోక అపరిచితుల్లా నడుచకొంటే అర్థం లేదు. అలాగే మంచి చెడుల విచక్షణలు మరచి జీవిస్తే అది సమాజ జీవనం అనిపించుకోదు. కాంతం భర్త చెప్పినట్లు అడవిలో మానుల్లా ఎవరికి వారైనట్లే ఉంటుంది. సాంఘిక జీవనంలో సామరస్యమే పరమార్థమంటూ గుర్తెరగాలని అభిలషించారు.

ముగింపు :

గంగాధర్ గారు నేటికాలంలో జరుగుతున్న సంఘటనలను ప్రత్యక్షంగా చూసి కళ్ళకి కట్టినట్లుగా తన కలంతో పాఠకలోకానికి తెలియజేసారు. సాహిత్యంలో కాలానికి అనుగుణంగా సామాజిక మార్పులను తనలో కలుపుకుంటూ అలరిస్తూ హితం కోరి వికాశాన్ని పొందుతుంది. అలాంటి సాహితీ వినీలాకాశంలో తమదైన స్థానాన్ని అందుకోవాలని భావకులు భావిస్తుంటారు. రచయితకు ఎలాంటి దృక్పథాలు అవసరమో ఎలాంటి దృక్కోణాలు వారికి ఉండకూడదో నిస్సంకోచంగా వెల్లడిరచారు. నేటి సమాజంలో జీవన విధానంలో ఎదుర్కొంటున్న సమస్యలను తన కథల ద్వారా సమాజంలో మార్పు కోరుకున్న రచయితలలో ఈయనను చెప్పవచ్చును.

**ఆధార గ్రంథాలు:**

1) కథాశిల్పం -` వల్లంపాటి వెంకట సుబ్బయ్య
2) కేవలం నవ్వు కథలు  - గంగాధర్ వడ్లమన్నాటి
3) 100% హాస్య కథలు - గంగాధర్ వడ్లమన్నాటి